ప్రజాశక్తి
మంగళవారం 11 జులై 2023 5
శ్రీ సత్యసాయి

జగనన్న సురక్షపై అలసత్వం వద్దు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జగనన్న సురక్ష కార్యక్రమంపై అలసత్వం చూపకుండా పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. దీనిపై అధికారులు అలసత్వం వహించకుండా పనిచేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలి : కలెక్టర్

ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో కో-ఆపరేటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 54 సొసైటీలు ఉన్నాయని, వాటిని కంప్యూటర్ రైజ్ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ సర్వీస్ సెంటర్లు ఈ సొసైటీ ద్వారా ఫోన్ పే గూగుల్ పే లాంటి 25 రకాల సేవలు అందించవచ్చన్నారు. మొదటి దశలో జిల్లాకు 72 గోడౌన్లు మంజూరు కాగా అవి పూర్తి అయినాయన్నారు. రెండవ దశలో 52 మంజూరు కాగా అవి టెండర్ల దశలో ఉన్నాయని త్వరగతిన టెండర్లు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డిఆర్ఓ కొండయ్య, ఆర్డిఒ భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు అర్జీలకు పరిష్కారం

జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్‌ల అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, వివిధ శాఖల అధికారులు ఇందులో పాల్గొని అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 251 అర్జీలను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందజేశారు. ఈ కార్యక్రమం అనంతరం డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతగా జగనన్నకు చెబుదాం అర్జీలకు పరిష్కారం చూపించాలని ఆదేశించారు. రీఓపెన్ కాకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమస్యలపై సమావేశం నిర్వహించాలని సర్కులర్ జారీ చేసిందన్నారు. నియోజకవర్గాల వారిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరవుతారని, సమావేశ నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈనెల 14వ తేదీన పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించేందు కోసం కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతిరోజు లక్ష మంది కూలీలకు పనులు కల్పించాలని లక్ష్యం ఉండగా, ప్రస్తుతం 65 వేలు మంది మాత్రమే పనుల కల్పిస్తున్నారన్నారు. కూలీల సంఖ్యను మరింత పెంచాలన్నారు. రామగిరి, పెనుకొండ, రొద్దం, తదితర మండలాల పరిధిలో కేటాయించిన లక్ష్యానికి గాను 20 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంటున్నారని, చిలమత్తూరు మండలంలో 25 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంటున్నారని చెప్పారు. ఈ మండలాల అధికారులు ఉపాధిని వేగవంతం చేసే చర్యలు తక్షణం తీసుకోవాలన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రాధాన్యత భవన నిర్మాణ పనులను అనుకున్న లక్ష్యంలోపు పూర్తి చేసే చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తయిన భవనాలకు సంబంధించి బిల్లులు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్డీఏ పీడీ నరసయ్య, డిపిఓ విజయ్ కుమార్, డిఎంహెచ్ఓ డా.కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డా॥ఎంటి.నాయక్, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అంగన్‌వాడీల నిరసనాగ్రహం

- ◆ సమస్యల పరిష్కారం కోరుతూ 36 గంటల నిరసన దీక్ష
- ◆ ఆందోళనతో అట్టుడికిన పుట్టపర్తి కలెక్టరేట్
- ◆ జిల్లా నలుమూలల నుంచి తరలొచ్చిన అంగన్‌వాడీలు

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై అంగన్‌వాడీలు నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల మొద్దునిద్రను తొలగించేందుకు పోరుబాట పట్టారు. 36 గంటల నిరసన దీక్ష పేరుతో చేపట్టిన ఆందోళన కార్యక్రమం సోమవారం నాడు పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రారంభం అయ్యింది. ముందుగా అంగన్‌వాడీ వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు పరచాలని ర్యాలీలో నినాదాలు చేశారు.

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్
పుట్టపర్తి రూరల్

జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పుట్టపర్తిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ర్యాలీ కలెక్టరేట్ వద్ద బైటాయించి నిరసన తెలిపారు. ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల వద్దకు ఆర్డీవో భాగ్యరేఖ కలెక్టర్ తరుపున అక్కడికి చేరుకుని వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఐసిడిఎస్ పీడీ రావాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. దీంతో అక్కడికి ఐసిడిఎస్ పీడీ లక్ష్మీకుమారి వచ్చారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై పీడీతో అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, అధ్యక్షురాలు మాబున్నీసా, శ్రామికమహిళా సంఘం కన్వీనర్ దిల్షాద్, రాష్ట్ర సిఐటియు ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడారు. ప్రతినిధుల బందం కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకుని అక్కడ 36 గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు వేతనాలను పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపుతానని 2017 దీపావళి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. వెలుగులు నింపడం మాట అటుంచి వారి జీవితాల్లో చీకట్లు నింపేలా మోడీ చర్యలు ఉంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాల ఫలితంగా అంగన్‌వాడీలు అనేక సమస్యలను పరిష్కరించుకున్నారని చెప్పారు. ఆ స్ఫూర్తితోనే ప్రస్తుత సమస్యల పరిష్కారానికి మరింత ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలపై రాజకీయ పెత్తనం, వేధింపులను ఆపాలన్నారు. 2022 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సూచించిన 1972 గ్రాజిటీ చట్టాన్ని అంగన్వాడీ వర్కర్లకు వర్తింపు చేయాలన్నారు. పది కోట్ల మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న ఐసిడిఎస్ ప్రాజెక్టును ఇంకా బలోపేతం చేసి వారికి ఆర్థిక వనరులు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు మరింత బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు ప్రభుత్వాలు ఎందుకు వెనుకంజ వేస్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడుతున్నారని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లు పూర్తయినా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం విచాకరం అన్నారు. యాప్‌ల పేరుతో అంగన్‌వాడీలపై వేధింపులను ఆపాలన్నారు. కేంద్రాల్లో తనిఖీల పేరుతో ఉన్నతాధికారుల వేధింపులనుఊ నియంత్రించాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఇంతియాజ్, జిఎల్.నరసింహులు, సాంబశివ గంగాధర్, శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్, రైతుసంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి, ఆటో యూనియన్ బాబావలి, పెద్దన్న, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, అధ్యక్షురాలు మాబున్నీషా, కోశాధికారి శ్రీదేవి, కదిరి రంగమ్మ, మడకశిర ఉష, ధర్మవరం చంద్రకళ, హిందూపురం శోభతో పాటు జిల్లా నలమూలల నుంచి వేలాదిగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సమస్యలపై ఐసిడిఎస్ పీడీతో మాట్లాడుతున్న సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

టిడిపి హయాంలోనే ముస్లింల అభివృద్ధి

శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి హయాంలోనే ముస్లిము మైనారిటీలు అభివృద్ధి చెందారని శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ తెలిపారు. పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అధ్యక్షతన 'ఘర్ ఘర్ కా నారా చంద్రబాబు హమారా' జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్‌రెడ్డి, కదిరి మున్సిపల్ మాజీ ఛైర్మన్ పర్వీన్‌బాను, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీతో రూ. 2 లక్షల వరకూ రుణాలు, నూర్‌బాషా ఫెడరేషన్ ఏర్పాటుతో పాటు రూ. 50 కోట్ల రుణాలు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు, గురుకుల పాఠశాలల ఏర్పాటు, అర్హులైన విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, ఇమామ్, మౌజాన్ల గౌరవ వేతనం పెంపు, దుల్హన్ పథకం ద్వారా యువతీ, యువకుల వివాహాలకు రూ. 50 వేలు, 3 వేలకు పైగా షాదీఖానాల ఏర్పాటు, రంజాన్ తోఫా, కానుకలు, యువతకు ఉపాధి అవకాశాలు, వేలాది మసీదుల మరమ్మతులు, పునర్నిర్మాణం చేపట్టారని వివరించారు. ఉర్దూ రెండో అధికార భాషగా గుర్తింపునకు కృషి చేయడంతో పాటు 11 ఉర్దూ టీచర్ల పోస్టులను భర్తీ చేశామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక 70కి దాడులు, ఆత్మహత్యలకు దారి తీసేలా వేధిం పులకు గురి చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముస్లిములపై భౌతిక దాడులకు పాల్పడుతున్న వైసిపి ప్రభు త్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భక్తర్‌సాబ్, కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మనోహర్, గణేష్, మద్దనకుంటప్ప, కుమారస్వామి, నరసింహమూర్తి, సన్న తిమ్మప్ప, కృష్ణమూర్తి, రామిరెడ్డి, ముస్లిం మైనారిటీలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్

వేళకు హాజరవని ఆర్‌బికె సిబ్బంది

రొళ్ల : ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, పనిచేసే చోటే నివాసం ఉండాలని ఆదేశాలు ఉన్నా రొళ్ల మండల కేంద్రంలో ఆచరణకు నోచుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఉదయం 10.50 గంటలైనా సిబ్బంది అందుబాటు లో లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన రైతులు నిరాశగా వెనుతిరిగి పోయారు. సోమవారం 'గ్రీవెన్స్' కార్యక్రమం ఉంటుందని తెలిసినా సిబ్బంది సమయానికి హాజరు కాకపోవడం పట్ల ప్రజలు మండిపడు తున్నారు. ఆర్‌బికె సిబ్బంది కార్యాలయానికి వచ్చేటప్పుడు దారిలోనే బయోమెట్రిక్ వేసుకుంటారని, అందుకే వారు కార్యాలయానికి ఆలస్యంగా వస్తారన్న ఆరోపణలు ఉన్నాయి.

గ్రంథాలయానికి టేబుల్ అందజేసిన తిమ్మారెడ్డి

గ్రంథాలయానికి టేబుల్ అందజేత

రొద్దం : స్థానిక గ్రంథాలయానికి సోమవారం టీచ్ హైస్కూల్ కరస్పాండెంట్ తిమ్మారెడ్డి ఒక టేబుల్ అందజేశారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి నాగరాజు దాతలు గ్రంథాలయానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీంతో స్పందించిన తిమ్మారెడ్డి తన వంతుగా ఒక టేబుల్‌ను అధికారి నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగరాజు, కరస్పాండెంట్ తిమ్మారెడ్డి, పాఠకులు పాల్గొన్నారు,

దానాల్లో అన్నదానం మిన్న

సోమందేపల్లి : అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సవితమ్మ గర్భిణులకు ఉచిత పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో నాలుగేళ్లుగా పౌష్టికాహారం అందిస్తున్న సవితమ్మకు వైద్య సిబ్బంది, గర్భిణులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్‌కుమార్, టిడిపి నాయకులు మద్దిలేటి, నాగరాజుయాదవ్, శివశంకర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల్లో నాయకత్వ మార్పు సహజమే

కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామి

ప్రజాశక్తి-మడకశిర

రాజకీయ పార్టీల్లో నాయకత్వ మార్పు అనేది సహజమైన ప్రక్రియ అని అందులో భాగం గానే తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుల మార్పు జరిగిందని కేంద్ర సామాజిక న్యాయ సాధికా రత సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి స్పష్టం చేశారు. ఆయన సోమవారం బెంగళూరు నుంచి పావగడకు వెళ్తూ మార్గ మధ్యలో మడకశిర పట్టణంలో ఆగి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాయకత్వ మార్పులో భాగంగా ఎపిలో పురంధరేశ్వరికి బాధ్యతలు అప్పజెప్పామన్నా రు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీల మద్దతు కోరుతున్నామని, అందులో భాగంగానే టిడిపితో పొత్తు ఉంటుందని తెలిపారు. ఆయన వెంట జోనల్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మార్ హనుమంతు, తదితరులు ఉన్నారు. అంతకుముందు మంత్రికి స్థానిక అంబేద్కర్ కూడలిలో డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు, స్థానిక బిజెపి నాయకుల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు.

విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం

ప్రజాశక్తి-రొళ్ల

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న విధ్వంసక, రాక్షస పాలనకు చరమగీతం పాడాలని టిడిపి వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్ కోరారు. రొళ్లలో సోమవా రం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విజయవాడలో చేనేత వ్యాపారులపై వైసిపి నేత దాడిని తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాలపై నిత్యం దాడులు జరుగుతున్నా బిసి మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులు నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రక్షణ కరువైందన్నారు. జగన్ సిఎం అయిన తర్వాత రాష్ట్రంలో ప్రతి ఇంట్లో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రామన్న, శివకుమార్, నరసింహప్ప, మురళి, రవికుమార్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక డాక్టర్ అంబేద్కర్ గురుకులం హాస్టల్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంటును సోమవారం హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకు బాలచంద్ర రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. హాస్టల్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను ప్రిన్సిపల్, స్టాఫ్‌తో పాటు విద్యార్థినులు సాహితీ గగన్‌మహల్ సంస్థ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది ప్రతాపరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ప్రతాపరెడ్డి బాలచంద్రకు వివరించగా స్పందించిన ఆయన 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రతాపరెడ్డి, హాస్టల్ వార్డెన్ మధుసూదన్‌రావు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రుణాలను రికవరీ చేయండి

ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత

ప్రజాశక్తి-రొద్దం

ఎడిసిసి బ్యాంకు రుణాలను త్వరగా రికవరీ చేయాలని బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత సొసైటీ సిబ్బందికి సూచించారు. ఆమె సోమవారం పెనుకొండ ఎడిసిసి బ్యాంకును సందర్శించి బ్యాంకు అభివృద్ధి, డిపాజిట్లు, గోల్డ్ లోన్స్, తదితర విషయాల గురించి మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎస్‌ఎహ్‌జి గ్రూపులకు విరివిగా రుణాలు ఇవ్వాలని, రుణాల రికవరీ శాతం తక్కువగా ఉందని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు సొసైటీలో క్లర్క్‌గా పనిచేస్తున్న నాగచంద్రుడు పదవీ విరమణ చెందగా ఎమ్మెల్యే శంకర నారాయణ నివాసంలో అతడికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌పే ఛైర్‌పర్సన్ అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మాజీ ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు, రొద్దం సొసైటీ ఛైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, ముత్యాలు, రామప్ప, సోమందేపల్లి ఛైర్మన్ కొల్లయ్య, బ్యాంకు సిబ్బంది, రొద్దం, ఇస్లాపురం, సోమందేపల్లి మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

గోరంట్ల రూరల్ : వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ సోమవారం మండల పరిధిలోని వెంకట రమణపల్లి పంచాయతీ పెరుమాలపల్లి గ్రామ సమీపంలోని నందీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాలు కురవని సమయంలో పూర్వీకులు ఆచరించిన పద్ధతిలోనే తాము కూడా గ్రామ ప్రజల సహాయ సహకారాలతో 250 కిలోల బియ్యం సేకరించి గ్రామస్తుల తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. అలాగే వరుణుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలు విరాళం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక వైసిపి నాయకుడు, కాంట్రాక్ట్ నారాయణస్వామి పుట్టినరోజు సందర్భంగా సోమవారం లేపాక్షిలోని కట్టమీద ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 50 వేల చెక్కు అందజేశాడు. అలాగే ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని నారాయణస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆదిమూర్తి, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

పవన్.. వాస్తవాలు తెలుసుకో...

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడమే వాలంటీర్ల ముఖ్యమైన విధి అని, అయితే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వాస్తవాలు తెలుసుకోకుండా వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పద్ధతి కాదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోమవారం ఓ వీడియోలో ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికే సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని, అందులో భాగంగా ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను నియమించి వారికి బాధ్యతలు అప్పగించారన్నారు. ఆ 50 ఇళ్లల్లో కుటుంబాల సమస్యలను మాత్రమే తెలుసుకొని ప్రభుత్వం ద్వారా పరిష్కరించే దిశలో అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారన్నారు. వారి పట్ల పవన్ కళ్యాణ్ అసభ్యకరంగా మాట్లాడడం, వ్యవస్థను కించపరచడం లాంటివి సరైన పద్ధతి కాదని హితవు పలికారు. 18 వేల మంది మహిళలు మిస్ అవుతున్నారన్న అసత్య ప్రచారం తగదన్నారు. బరితెగించి మాట్లాడటం.. పవన్ కళ్యాణ్ ఇకనైనా మానుకోవాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధి వైసిపితోనే సాధ్యం : ఎమ్మెల్యే

అమరాపురం : ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. అమరాపు రం సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి ఈరన్న, వైస్ ఎంపిపిలు లలితమ్మ, కృష్ణమూర్తి, జడ్పిటిసి సారక్క నరసిం హమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మునిస్వామి, త్రిలోక్‌నాథ్, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని రంగేగౌడ్, డైరెక్టర్ వీరక్యాతప్ప గగన తనువీర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి, సింగిల్‌విం డో అధ్యక్షులు చిక్కన్న, నాయకులు శ్రీనివాసరెడ్డి, మంజునాథ్, రాజు, నరసింహరాజు, గడ్డం రాజా పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అక్కడ ఎనీటైం మందు..!

జాతీయ రహదారి పక్కనే బార్
రెచ్చిపోతున్న మందుబాబులు
పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

ఉదయం ఏడుగంటలకే బార్ తెరిచిన దృశ్యం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎక్సైజ్ (ప్రొహిబిషన్ శాఖ నిబంధనలను తుంగలో తొక్కుతూ బడి, గుడి, ఇల్లు, ఉన్న లెక్కచేయని బార్ యజమానులు ఎనీ టైం మందు(ఎటిఎం) అనే తరహాలో వ్యాపారాలు చేసుకుంటున్నారన్న విమర్శలు పట్టణంలో పెద్దఎత్తున వ్యక్తమవుతున్నాయి. కదిరి పట్టణంలో ఓ బార్ యాజమాని దర్జాగా ఉదయం ఏడు గంటలకే మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. రాత్రి 10 తర్వాత కూడా విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. పట్టించుకోవాల్సిన పోలీసులు సంబంధిత శాఖ అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో బార్ యాజమాన్యం మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తోంది. కదిరి పట్టణ నడిబొడ్డున పివిఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసి నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారీతిన మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్న విమర్శలు పట్టణప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. జాతీయ రహదారి పక్కనే డిగ్రీ, బిఇడి కళాశాలలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం 200 మీటర్ల దూరంలో బార్లను ఏర్పాటు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దారి గుండా ఆలయాలకు, ఇళ్లకు వెళ్లే మహిళలు, ప్రజలు భయ ఆందోళనకు గురవుతున్నారు. సమీపంలో పలు కళాశాలలు ఉండడంతో కళాశాలకు వెళ్లాలంటే విద్యార్థులు జంకుతున్నారు. ఉదయమే మద్యం ప్రియులు మస్తుగా మద్యం సేవించి వీరంగం చేస్తుంటారు. దీంతో ఏ క్షణంలో ఏమి జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు కళాశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బడులకు దూరంగా బార్లు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకోని యాజమాన్యంపై సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

ఇష్టారాజ్యంగా బార్ యాజమాన్యం : నిబంధనలను పట్టించుకోని పివిఆర్ బార్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు సాగిస్తూ పెద్ద ఎత్తున జేబులు నింపుకుంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం ఏడు గంటలకే షాపును తెరిచి విక్రయాలు చేస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత కూడా మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు విమర్శలున్నాయి. రాత్రి వేళల్లో మద్యం ప్రియులు నానా హంగామా చేస్తుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు : నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన పివిఆర్ బార్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ ఎక్సైజ్ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయంలో అధికారుల చిత్తశుద్ధిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి నిబంధనలు పాటించని పివిఆర్ పై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా పివిఆర్ బార్ ఉదయం 7 గంటలకే తెరవడంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. బార్‌కున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రయివేటు డిగ్రీ కళాశాలలు వెళుతున్న విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది. కళాశాల, ఆలయం సమీపంలో బార్ ఏర్పాటుకు అధికారులు ఎలా అనుమతి ఇచ్చారో చెప్పాలి. ఇప్పటికైనా ఎక్సైజ్ వాఖ అధికారులు పివిఆర్ బార్ అండ్ రెస్టారెంట్ పై చర్యలు తీసుకోవాలి

బాబ్జాన్,
ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు

నిబంధనలు పాటించకపోతే చర్యలు

దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలు మాత్రమే ఎక్సైజ్ నిబంధనల పరిధిలోకి వస్తాయి.. అన్నీ చూసిన తర్వాతనే అనుమతులు మంజూరు చేస్తాం. ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఉదయమే బార్ తెరుస్తున్న పివిఆర్ బార్ అండ్ రెస్టారెంట్ పై విచారించి తగిన చర్యలు తీసుకుంటాం

రమేష్
ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్

నేరాలు ఘోరాలు

పింఛన్ పేరుతో వృద్ధురాలికి మోసం
చెవికమ్మలతో పరారీ

ప్రజాశక్తి ముదిగుబ్బ

రెండు సంవత్సరాల నుంచి నిలిచిపోయిన పింఛను డబ్బులు రూ. 50వేలు వచ్చాయని పదివేల రూపాయలు ఇస్తే పింఛను మొత్తం ఇస్తామని నమ్మబలికిన ఓ అగంతకుడు వృద్ధురాలి నుంచి చెవికమ్మలు తీసుకుని పరారైన ఘటన మండలకేంద్రమైన ముదిగుబ్బలో సోమవారం చోటు చేసుకుంది. అందుకు సంబందించి గ్రామస్తులు, బాధితురాలు తెలిపన వివరాలు... మండలకేంద్రానికి చెందిన సత్తార్‌సాబ్ భార్య 60 సంవత్సరాల మాహబూబ్‌బీకి రెండు సంవత్సరాల నుంచి పింఛను రాలేదు. ఈ నేపథ్యంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మహబూబ్‌బీ ఇంటికి వచ్చి రెండు సంవత్సరాల నుంచి రావాల్సిన పింఛను డబ్బులు రూ.50వేలు వచ్చాయని చెప్పాడు. అయితే ఆడబ్బులు ఇవ్వాలంటే పదివేల రూపాయలు ఇవ్వాలని అడిగారు. దీంతో మహబూబ్‌బీ తన ఇంటి మేడపైకి వెళ్లింది. ఆమె వెంటే వెళ్లిన అగంతకుడు డబ్బులు లేకపోతే చెవిలో కమ్మలు ఇవ్వాలని, పింఛను డబ్బులు వచ్చిన తరువాత వాటిలో పదివేల రూపాయలు తనకు ఇవ్వవచ్చని చెప్పాడు. అతని మాటలు నమ్మిన వృద్ధురాలు మహబూబ్‌బీ తన చెవిలో కమ్మలు తీసి ఇచ్చింది. కమ్మలు తీసుకున్న వెంటనే అగంతకుడు మేడ దిగి తను వచ్చిన ద్విచక్రవాహనంలో పరారయ్యాడు. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న వృద్ధురాలు లబోదిబోమంది. పట్టపగలే ఓ అగంతకుడు వృద్ధురాలిని మోసం చేసిన ఘటనపై మండలకేంద్రంలోని ప్రజలు అవాక్కయ్యారు.

బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

పుట్టపర్తి క్రైమ్ : ఆర్టీసీ బస్టాండ్ లో బస్సు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన సోమవారం పుట్టపర్తిలో చోటుచేసుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి కి చెందిన చిన్న నరసప్ప (65) మున్సిపాలిటీ కార్యాలయంలో పనిమీద వచ్చాడు. బస్టాండ్‌లో ఉన్న వృద్ధుడిని అక్కడ బస్సు రివర్స్ చేసుకుంటున్న సమయంలో ఢీకొంది. దీంతో నరసప్పకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరసప్ప మృతిచెందాడు. వృద్ధుడికి భార్య నారాయణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి తెలిపారు.

పట్టాను రద్దు చేయండి

బుక్కపట్నం : మండల పరిధిలోని ఎర్లంపల్లికి చెందిన రైతు అంజన్నప్ప చెందిన పట్టా భూమిని ఇతరుల పేరు మీద అక్రమంగా పట్టా నమోదు చేసుకున్నారని వాటిని రద్దు చేయాలని బాధితుడు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు అంజనప్ప మాట్లాడుతూ కొత్తకోట గ్రామంలో 381 సర్వేనెంబర్ నందు 3.85 ఎకరాల భూమి వన్ బి నెంబర్ 1265 గల తమ పూర్వీకులకు చెందిన భూమి తమ స్వాధీనంలో ఉండేదన్నారు. ఈ భూమిని ఎలాంటి హక్కు లేకుండా రామసాగం గ్రామానికి చెందిన శంకరనారాయణ, బొజ్జలప్ప అనే ఇద్దరు వ్యక్తులు అక్రమంగా పట్టాదారు పాస్ పుస్తకం నమోదు చేసుకున్నారని విమర్శించారు. ఈ అక్రమ పట్టాను రద్దుచేసి తమ పూర్వీకులకు చెందిన భూమిని తమ పేరు మీద నమోదు చేయాలని డిటి రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు.

బలహీన వర్గాలకు టిడిపిలో సముచితస్థానం

బుక్కపట్నం : తెలుగుదేశం పార్టీలో బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందని సత్యసాయి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మండల పరిధిలోని బుచ్చయ్యగారిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న తగేమ్ రాము కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ జయరాం, టిడిపి నాయకులు వేణుగోపాల్ రెడ్డి, వెంకటరాముడు, సామకోటి ఈశ్వరయ్య, ప్రకాష్, ఆంజనేయులు, కొండన్న, బద్రీనాథ్, గంగాద్రి పాల్గొన్నారు.

ముందస్తు ఆడిట్‌తో పారదర్శకత

హిందూపురం : పురపాలక సంఘాల్లో నిధులు దుర్వినియోగం కాకుండా ఉన్న నిధులను సక్రమంగా వాడుకునే విధంగా చూడడానికే ముందస్తు అడిట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అడిట్ అధికారి వెంకట శివారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం హిందూపురం పురపాలక సంఘంలో ముందస్తు అడిట్ (ప్రీ–అడిట్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట శివారెడ్డి మాట్లాడుతు పురపాలక సంఘాల్లో ఖర్చు చేసే ప్రతి రూపాయికి ముందస్తు అడిట్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిట్ అధికారులు శోభన్ రెడ్డి, మనోహర్, రాధిక, జిల్లా నోడల్ అధికారి నరసింహామూర్తి, రామ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ సాగుసాయం అందించాలి

రామగిరి : ప్రతి రైతుకూ సాగుసాయం అందించాలని ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు జెవి. రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ తరహాలో మన రాష్ట్రంలో ప్రతి రైతుకూ సాగుసాయం అందించాలని కోరారు. ప్రతి రైతుకు ఎకరాకు పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సి.ముత్యాలప్ప, రైతులు అశోక్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Prl.Civil judge at Pavagada

O.S.No:71/2022

Between:
G.K.Puttamma ...Plaintiff
V/s
Smt.Rathnamma W/o Late Thipperudra, Aged about 56 year. ... Defendants

Paper Publication

WHERE AS, The Plaintiff has filed the above sit, Seeking Partition and separate possession. defendants No.7.Thimmappa S/o Late Eranna, aged about 60 years, R/O Kumnbaranagenahalli Village, Madakasira Taluk, Sathyasai Dist A.P, 8.Naryanappa S/o Late Eranna, aged about 55 years, R/O Kumnbaranagenahalli Village, Madakasira Taluk, Sathyasai Dist A.P. defendants No.9 Smt.Parvathamma D/o Late Sanna Nagamma, aged about 45 years, R/O Hemavathi Village, Madakasira Taluk, Sathyasaia Dist. A.P.

Now the matter set down, for issue notice/suit Summons to all or any interested persons, or legal heirs who even got any objection over the above case. May appear in this either as respondent/dependant and may prosecate the same on the date of hearing i.e. 02-08-23 you any hereby called upon to appear before this Hon'ble court at 11 Am on the said date of hearing either person or through your counsel if you fail to appear this court, The matter will be heard and exparte.

Given under my hand and seal of the court this day of 20-06-2023.

(By order of the Court)

R.T. Mallikarjunaiah, Advocate
Pavagada.

చేనేతల జోలికి వస్తే చూస్తూ ఊరుకోం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చేనేతల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని టీడీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ హెచ్చరించారు. విజయవాడ ఘటన బాధితులు గిర్రాజు శశి, కోటం ఆనంద్‌ను ఆమెతో పాటు మాజీ మంత్రి పరిటాలసునీత, మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. జరిగిన దాడి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ విజయవాడలో సిల్క్ వ్యాపారి, వైసీపీ కార్యకర్త అవినాశ్ గుప్తా ధర్మవరం వస్త్ర వ్యాపారులపై దాడి చేయడం దారుణమన్నారు. చేనేత వ్యాపారులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి చీరలను విక్రయిస్తుంటారని అన్నారు. ఈ క్రమంలో కేవలం నమ్మకంపై లక్షల రుపాయలు విలువ చేసే పట్టుచీరలు అప్పుగా ఇచ్చి ఆ అప్పును అడిగితే బట్టలు ఊడదీసి కొడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రాజకీయాలు చేయడానికి రాలేదని బాధితుల పక్షాన నిలబడటానికి వచ్చామని అన్నారు. ఇకపోతే దాడికి గురైన వస్త్రవ్యాపారుల ఇళ్ల వద్దకు వచ్చి పరామర్శించాల్సిన నాయకులు వారినే తమ ఇంటికి పిలపించుకోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విజయవాడ ఆలయ షాపు వద్ద ధర్నా చేయాలన్నారు. ప్రస్తుతం ధర్మవరంలో వైసీపీ నాయకులు బెదిరింపులు, కబ్జాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. ఇద్దరు వ్యాపారస్థులపై జరిగినది దాడికాదని ఇది చేనేత వ్యవస్థపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప మాట్లాడుతూ ధర్మవరం వస్త్ర వ్యాపారులు ఇచ్చిన అప్పు కట్టమని అడిగితే కొట్టడం దారుణమన్నారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వస్త్రవ్యాపారులకు రావాల్సిన బకాయిలు తిరిగి ఇప్పించాలన్నారు. కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ చేనేత వ్యవస్థలో శ్రమ దోపిడి జరుగుతూనే వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం
మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలతో కలిసి పల్లె నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని బిసి కాలనీలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 641 మంది ఇళ్లు లేని వారికి ప్లాట్లు కేటాయించామనాన్రు. అడవి లాగా ఉన్న ఆ ప్రాంతంలోని చెట్లు కొట్టించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తే వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా కనీసం విద్యుత్ స్తంభాలు వేయలేదని విమర్శించారు. ఫలితంగా బిసి కాలనీ మొత్తం చీకటిమయంగా మారిందన్నారు. సరైన డ్రయినేజీ లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండి దోమలకు నిలయంగా మారాయన్నారు. కాలనీలో కనీసం రోడ్లు కూడా వేయలేదన్నారు. నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో స్థానిక ఎమ్మెల్యే చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ సర్పంచి వెంకటరమణప్ప, మాణిక్యం బాబా తదితరులు పాల్గొన్నారు



నిరసనలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

వైపిపికి రోజులు దగ్గరపడ్డాయి

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని 33వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి గోసలశ్రీరాములు అన్నారు. పట్టణంలోని 33వ వార్డులో సోమవారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేంద్ర, దుర్గాప్రసాద్, ఈశ్వరయ్య శ్రీనివాసులు, గంగాధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టిడిపి నాయకులు

కామన్ సివిల్ కోడ్ చట్టాన్ని రద్దు చేయండి

హిందూపురం : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకోస్తున్న కామన్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి చట్టం) చట్టాన్ని రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి నారాయణ స్వామి కర్నాటక రాష్ట్రం పావగడకు వెళుతున్న విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు మడకశిరలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కామన్ సివిల్ కోడ్ చట్టంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను ప్రధాని, హోంమంత్రికి వివరించి రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నగారా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్, దళిత హక్కులపరిరక్షణ సమితి అధ్యక్షులు హనుమంతు, దండోరా నాయకులు నాగార్జున, సూరి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

కదిరి టౌన్ : జగనన్న సురక్ష తో ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సిద్దా రెడ్డి పేర్కొన్నారు. కదిరి మున్సిపల్ పరిధిలోని సిరికల్చర్ మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న కొత్త దళితవాడ, మశానంపేట, మదనపల్లి రోడ్డు మరియు బైపాస్ రోడ్డు వార్డు సచివాలయాల, రూరల్ మండలం కొండమనాయనపల్లి గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, ఎంపిపిలు, జెడ్పీటీసీలు, వైఎస్‌చైర్మన్లు తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని 10,11,12 వ వార్డులలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను మున్సిపల్ కమిషనర్ హరి బాబు, వార్డు కౌన్సిలర్ దిల్షాదున్నిసా, వైసిపి కదిరి పట్టణ అధ్యక్షులు కె ఎస్ బహవుద్దీన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిచ్చిలి శంకర, ఖితాబుద్దిన్, మస్తాన్‌ఖాన్, మౌలా, రహీమ్, పార్వేజ్, అలీ, సమీర్, జుబేదా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలు సత్వర పరిష్కారమవుతాయని డిఎస్‌ఒ వంశీకృష్ణారెడ్డి, తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సౌజన్యకుమారి, సర్పంచు చెడిపోతుల గోపీనాథ్, ఎంపీటీసీ రేణుకారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామ సచివాలయం ఆవరణంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీ కాళ్లు పట్టుకుంటాం... ఇసుక తరలింపును ఆపండి

సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- పరిగి

'మీకాళ్లు పట్టుకుంటాం.. ఇసుక అక్రమ తరలింపును ఆపండి' అని పరిగి గ్రామస్తులు సబ్‌కలెక్టర్‌ను వేడుకున్నారు. సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం పరిగి మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులతో పాటు మండలంలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ స్పందన కార్యక్రమానికి పలువురు తమ సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు ఇందులో భాగంగా పరిగి గ్రామస్తులు తమ సమస్యను విన్నవించారు. రెండు నెలల నుండి జయమంగలి నది ద్వారా ఇసుక రీచ్ పేరుతో వందల టిప్పర్ల ఇసుకను తరలిస్తున్నారని వాపోయారు. ఈ తరలింపును అడ్డుకున్నా అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇసుక తరలింపును వెంటనే నిలుపుదల చేయకపోతే పరిగి మండలం మరోసారి కరువు మండలంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన సబ్‌కలెక్టర్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా కషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాన్ని పునరుద్ధరించాలని, అదే స్థలంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు సబ్‌కలెక్టర్‌ను కోరారు. మండల వ్యాప్తంగా విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఫీజుల నియంత్ర నియంత్రణపై విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రమేష్ కోరారు. పరిగి చెరువు పరిధిలో ఉన్నా ఆయా కట్టు భూములకు నీటిని విడుదల చేయాలని వైసిపి నాయకులు డివి రమణ, చిన్న పల్లి జయరాం సబ్ కలెక్టర్ కోరారు. మండలంలోని ప్రెస్ క్లబ్ కోసం 10 సెంట్లు స్థలాన్ని కేటాయించి ప్రెస్ క్లబ్ నిర్మాణానికి నిధులు సమకూర్చాలని పరిగి విలేకరుల సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్ తోటి విలేకరులతో సబ్ కలెక్టర్ ను కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులతో పాటు తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీవో సరస్వతి, ఎంఇఒ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత వస్త్రవ్యాపారులు

వస్త్రవ్యాపారుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

విజయవాడ ఘటనకు నిరసనగా వస్త్రవ్యాపారులు సోమవారం స్వచ్ఛందంగా దుకాణాలను బంద్ చేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా నేసేపేటలోని షాపులన్నీ బంద్ చేసి. తరువాత శమీనారాయణస్వామి గుడి వద్ద నుండి ర్యాలీగా కళాజ్యోతి సర్కిల్కు చేరుకుని అక్కడే ఉన్న డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చర్యలుతీసుకోవాలని వారు డీఎస్పీని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఆర్డీవో తిప్పేనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీకి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలుకం మధుసూదన్ రెడ్డి తన సంఘీబావాన్ని తెలిపారు. ఈ ర్యాలీలో వస్త్ర వ్యాపారులు గిర్రాజు నగేశ్, గిర్రాజు రవి, పోలా వెంకటనారాయణ, గిర్రాజు శశి, కోటం ఆనంద్, ఉడుముల రాము,గుండా పుల్లయ్య, రంగం రామకృష్ణ, కొండమీద రాయుడు, జింకాచంద్ర, మెటికలకుళ్లాయప్ప, కలవల రాంకుమార్, పోలారామాంజనేయులు, కాచర్ల అంజి, శంకర తేజశ్వర్, శంకర యుగంధర్, చెలిమి పెద్దన్న, ఇటికంటి మహేశ్, దత్తశివ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

నైపుణ్య అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ శాఖ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14న పెనుకొండలోని జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి నెల రెండవ శుక్రవారం స్కిల్ డెవలప్మెంట్ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. జాబ్ మేళాలో 12 రకాల కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదవ తరగతి, డిగ్రీ, ఐటిఐ, డిప్లమా, బీటెక్ చదివిన విద్యార్థులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం మాట్లాడుతూ గత నెల హిందూపురంలో నిర్వహించిన జాబ్ మేళాలో 506 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా 205 మంది ఎంపిక చేశామన్నారు. పెనుకొండలో 14న నిర్వహించే జాబ్ మేళా లో నిరుద్యోగ యువత పాల్గొనాలని కోరారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఓ కొండయ్య, ఆర్‌డిఒ భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

స్పందనకు వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు అలసత్వం వహించకుండా వాటిని పరిష్కారం వెంటనే చూపాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి లోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుండి 60 పిటీషన్లు స్వీకరించారు. పోలీసు పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులకు ఫోన్ లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ విష్ణు , లీగల్ అడ్వైజర్ సాయి నాథ్ రెడ్డి , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితో సాదత్‌అలీఖాన్

ముఖ్యమంత్రిని కలిసిన మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కదిరికి చెందిన మైనార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు సాదత్ అలీ ఖాన్ తదితరులు జగన్‌ను కలవగా ఆయన కదిరిలో పార్టీ పరిస్థితులను అడిగితెలుసుకున్నట్లు సాదతే ఆలీఖాన్ తెలిపారు

గర్భిణులకు వైద్యపరీక్షలు

హిందూపురం : రూరల్ మండలం చౌళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యులు ఆధిశేషా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గర్భిణులకు బిపి, షుగర్, ఎత్తు, బరువు, హెచ్ఐవి, సిఫీలిస్ పరీక్షలు నిర్వహించామన్నారు. 8వనెల గర్భిణులకు ఉచితంగా స్కానింగ్ కు రెఫర్ చేశామన్నారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది భారతి, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : పౌష్టికాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని డాక్టరు వి. కమల్ రోహిత్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 43 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వారికి పలు సూచనలు చేశారు. కదిరి రోటరీ క్లబ్ ప్రతినిధులు పృథ్వీ, రంజిత్ రాజు, విద్యావతి గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చిలమత్తూరు : చిలమత్తూరు పిహెచ్‌సిలో పని చేసే వైద్యులు విదినిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఎంపిపి పురుషోత్తమరెడ్డి హెచ్చరించారు. రెండు రోజుల క్రితం ఎంఎల్‌హెచ్‌పి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై వైద్య సిబ్బందితో ఎంపిపి సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో వైద్యసేవలు అందించాల్సిన వైద్యులు ఆటలాడటం తప్పని అన్నారు. దానిని వదిలేసి విడియో ఎవరు తీశారన్న దానిపై విచారణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ వ్యవహారం వల్ల ఒక ఉద్యోగి ప్రాణం పోయేదని అన్నారు. వైద్యుల మధ్య మనస్పర్థలతో ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఒక వేళ ఇలాగే కొనసాగాలనుకుంటే బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామక్రిష్ణ, తేజశ్వని తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన

గాండ్లపెంట : తమ బకాయి వేతనాలు చెల్లించాలని మండల పరిధిలోని సోమవారం కురమామిడి గ్రామ సచివాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు సచివాలయానికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు ఎం. రామానుజులు, ఎం. శ్రీరాములు మాట్లాడుతూ. గత ఏడాది నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. తమ సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తమ కష్టాలను తట్టుకోలేక తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయానికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో యాదవేంద్ర కార్మికుల వద్దకు వెళ్లి చర్చించారు. మూడు నెలలు వేతనాలు తక్షణం మంజూరు చేస్తున్నామని పెండింగ్‌లో ఉన్న వేతనాలు కూడా త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు.

సచివాలయం ముందు కార్మికుల నిరసన